
సాక్షి బాపట్ల

గురువారం । 4 । జూలై । 2024



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 513.90 అడుగుల వద్ద ఉంది. ఎస్‌ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది.



అట్రాసిటీ కేసులపై శ్రద్ధ పెట్టాలి

నెహ్రూనగర్: ఎస్సీ ఎస్టీ కేసులపై శ్రద్ధ పెట్టాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ళ అరుణ్ కుమార్ బుధవారం సచివాలయంలో హోం మంత్రి వంగలపూడి అనితను కోరారు.



180 మందికి వైద్యపరీక్షలు

ఫిరంగిపురం: రేపూడిలో బుధవారం ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యురాలు శ్వేత 180 మందికి వైద్యపరీక్షలు చేసి మందులు అందజేశారు.

న్యూస్‌రీల్

కమ్యూనికేషన్ కార్యాలయం ప్రారంభం



నరసరావుపేట రూరల్: జిల్లాలో పోలీస్ కమ్యూనికేషన్ వ్యవస్థ పటిష్టంగా ఉండాలని జిల్లా ఎస్పీ మలికా గార్గ్ తెలిపారు. నరసరావుపేట రూరల్ పోలీస్‌స్టేషన్ కాంపౌండ్‌లోని ఆధునికీకరించిన జిల్లా కమ్యూనికేషన్ కార్యాలయాన్ని బుధవారం ఎస్పీ ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా అడ్మిన్ ఎస్పీ ఆర్.రాఘవేంద్ర, క్రైమ్ అడిషనల్ ఎస్పీ ఎస్.లక్ష్మీపతి, ఏఆర్ డీఎస్పీ గాంధీ, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్లు బి.సురేష్‌బాబు, యు.శోభన్‌బాబు, కమ్యూనికేషన్ ఇన్‌స్పెక్టర్లు పి.చిన్నవెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

గుంటూరు తూర్పులో 14.6 మి.మీ. వర్షం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు అత్యధికంగా గుంటూరు తూర్పులో 14.6 మిల్లీ మీటర్ల వర్షం పడగా, అత్యల్పంగా తాడేపల్లి మండలంలో 1.4 మి.మీ. పడింది. సగటున 4.9 మి.మీ వర్షపాతం నమోదైంది. మండలాలవారీగా ఫిరంగిపురం మండలంలో 13.2 మి.మీ., గుంటూరు పశ్చిమ 11, తెనాలి 10.8, కొల్లిపర 10.2, దుగ్గిరాల 7.8, పెదకాకాని 7.2, తుళ్ళూరు 5.4, మేడికొండూరు 3.2, మంగళగిరి 1.8, చేబ్రోలు మండలంలో 1.6 మి.మీ చొప్పున వర్షం పడింది.

నేడు విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయండి

ఏఎన్‌యూ(గుంటూరు): ఉన్నత విద్యా రంగంలో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 4న నిర్వహిస్తున్న విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు కోరారు. బంద్ నోటీసును ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు బుధవారం యూనివర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య సంధ్యా కొలేకి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ స్టేట్ కమిటీ సభ్యురాలు నమిత మాట్లాడుతూ పీహెచ్‌డీ ప్రవేశానికి నెట్ స్కోరింగ్ విధానాన్ని రద్దు చేయాలని, నెట్ పరీక్ష పేపర్ లీకేజ్ వల్ల ఎంతో మంది విద్యార్థులు నష్టపోతున్నారని, వన్ నేషన్ - వన్ ఎగ్జామ్ ముసుగులో మొత్తం పరీక్ష వ్యవస్థ కుప్ప కూలిందని ఆరోపించారు.

ప్లాస్టిక్ రహిత బ్యాగ్‌లు పర్యావరణహితం

పల్నాడు జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవి

నరసరావుపేట ఈస్ట్: పర్యావరణానికి ప్రమాదకరమైన ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌లను వినియోగించవద్దని జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ రవి తెలిపారు. అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవం సందర్భంగా సత్తెనపల్లికి చెందిన హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నానో వేవ్ బ్యాగ్‌లను బుధవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత సంచులను వినియోగించటం ద్వారా ప్లాస్టిక్ ప్రళయాన్ని తగ్గించి పర్యావరణ సమతుల్యాన్ని కాపాడవచ్చని వివరించారు. కూరగాయలు, ఆకుకూరల్లో సైతం ప్లాస్టిక్ కణాలను శాస్త్రవేత్తలు గుర్తించారని తెలిపారు. హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు, సభ్యుడు మురళీకృష్ణ పాల్గొన్నారు.

యార్డుకు 42,587 బస్తాల మిర్చి రాక



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 42,587 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 41,920 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ. 16,800 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 19,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 8,500 నుంచి రూ. 17,500 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 8,000 నుంచి రూ. 19,000 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.12,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 18,775 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

వేట సాగదు...పూట గడవదు

- వాతావరణ మార్పులతో మత్స్యకారులకు తప్పని ఇబ్బందులు
- సుదూర వేట సాగించినా ఫలితం శూన్యం



వేటకు వెళ్లకుండా తీరంలో నిలిపి ఉంచిన పడవలు



చేపల కోసం వలలో చూసుకుంటున్న మత్స్యకారులు

వాతావరణ మార్పులతో మత్స్యకారులకు పూడ గడవని పరిస్థితి నెలకొంది. ఎన్నో ఇబ్బందులతో సముద్రంలో వేట సాగించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. కడలిలో కిలోమీటర్లు వెళ్లినా వాతావరణంలో వచ్చిన మార్పులతో ఒట్టి చేతులతో తిరిగి వస్తున్నారు. వలల్లో చేపలు పడకపోవటంతో నిరాశతో వెనక్కి వస్తున్నారు. సాధారణంగా మే నుంచి 45రోజుల వేట నిషేధం ఎత్తివేసిన తర్వాత చేపల వేట సజావుగా సాగుతుంది. అయితే, అల్పపీడన ద్రోణితో వర్షాలు సరిగా కురవక పోవడంతో చేపలు సముద్రం నుంచి బయటకు రావడం లేదు. వేట కూడా సరిగా సాగడం లేదు. సముద్రంలో సుదూరం వెళ్లినా ఫలితం ఉండటం లేదు. డీజిల్ ఖర్చుకు సరిపడా కూడా మత్స్య సంపద పడటం లేదు. ఇదే పరిస్థితి మరో నెల రోజులు పాటు కొనసాగే అవకాశం ఉందని మత్స్యకారులు వాపోతున్నారు.

– బాపట్ల

తీరంలో ప్రత్యేక భద్రత చర్యలు



తీరంలో పోలీసు సిబ్బంది కాపలా

ఎరుపు రంగు హెచ్చరికల ఏర్పాటు

చీరాల టౌన్: వాడరేవు, రామాపురం తీర ప్రాంతాల్లో పర్యాటకులు అలల తాకిడికి గల్లంతు కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని రూరల్ ఎస్‌ఐ శివకుమార్ తెలిపారు. ఇటీవల పలువురు అలల్లో కొట్టుకుపోయి మృత్యువాతపడ్డారు. దీంతో పోలీసులు వాడరేవు, రామాపురం సముద్ర తీర ప్రాంతాలకు పర్యాటకుల్ని అనుమతించడం లేదు. పర్యాటకుల భద్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. సముద్రంలో స్నానాలు చేసే వారు లోతుకు వెళ్లకుండా హెచ్చరిస్తూ ఎరుపు జెండాలతో వెదురు బొంగుల్ని ఏర్పాటు చేశారు. పర్యాటకులెవరూ వీటిని దాటకుండా అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నామని ఎస్‌ఐ శివకుమార్ తెలిపారు. కొద్ది రోజుల్లోనే తీర ప్రాంతంలో సమగ్ర సంరక్షణ చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. గజ ఈతగాళ్ల, తీర ప్రాంతంలో గస్తీ, పికెట్లు, హెచ్చరిక బోర్డులు, ఇతర సదుపాయాల్ని ఏర్పాటు చేసిన తర్వాతే పర్యాటకుల్ని అనుమతిస్తామని ఆయన పేర్కొన్నారు. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధుల ఆదేశాలతో త్వరలోనే అనుమతిని ప్రకటిస్తామని వెల్లడించారు.

విద్యార్థులకు సులభరీతిలో బోధనచేయాలి

ఇన్‌చార్జి డీఈవో గల్లా వెంకటేశ్వర్లు



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

బాపట్ల టౌన్: విద్యార్థులకు సులభరీతిలో బోధనపై ఉపాధ్యాయులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఇన్‌చార్జి డీఈవో గల్లా వెంకటేశ్వర్లు తెలిపారు. పట్టణంలోని సరస్వతి మెమోరియల్ హైస్కూలులో నిర్వహిస్తున్న టీచ్ టూల్ శిక్షణ బుధవారం మూడో రోజుకు చేరింది. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ టీచ్ టూల్ కార్యక్రమం ఉపాధ్యాయులకు బోధన ప్రక్రియలో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. భావ వ్యక్తీకరణ, తరగతి గది సంస్కృతి, బోధన కృత్యాల సాధన, పరిశీలన, అవగాహన తదితర విషయాలపై విద్యార్థులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. విద్యార్థుల సామర్థ్యానికి అనుగుణంగా బోధన ఉండాలని చెప్పారు. విద్యార్థి సామర్థ్యం మధ్యస్తంగా ఉందా? ఉన్నతంగా ఉందా? అనే విషయాల్ని క్షుణ్ణంగా తెలుసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో బాపట్ల సమగ్ర శిక్షా ఏఎంవో డాక్టర్ బి. మోసెస్, రిసోర్స్ పర్సన్ మహమ్మద్ అక్రమ్ ఘోరీ, పి.పోతురాజు, డి.రాజారావు, సీఆర్ఎంటీ అధికారులు పాల్గొన్నారు.

శింగరకొండ ఆలయ హుండీ కానుకుల లెక్కింపు

అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం హుండీ కానుకల్ని బుధవారం దేవదాయ శాఖ అధికారి, పరిశీలకుడు పి. శైలేంద్ర సమక్షంలో సిబ్బంది లెక్కించారు. 97 రోజులకు రూ.30,40,189, యూఎస్‌ఏ డాలర్స్ 12, దుబాయ్ ఖాతరమ్స్ 11 వచ్చినట్లు శైలేంద్ర తెలిపారు. కార్యక్రమంలో దేవస్థాన ఏసీ టి.సుభద్ర పాల్గొన్నారు.



జీఎస్టీ ఉద్యోగుల సక్సెస్ మీట్

కమిషనర్ నరసింహారెడ్డిని సత్కరించిన ఉద్యోగులు



జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డిని సత్కరిస్తున్న ఉద్యోగులు

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): 8వ జీఎస్టీ దినోత్సవాన్ని వినూత్నంగా అత్యంత వైభవంగా నిర్వహించిన సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డిని ఆశాఖ ఉద్యోగులు సత్కరించారు. స్థానిక కన్నవారితోటలోని జీఎస్టీ భవన్‌లో బుధవారం సక్సెస్ మీట్ కార్యక్రమం జరిగింది. ఉద్యోగ సంఘ నాయకులు గాదె శ్రీనివాసరెడ్డి, జవహర్‌బాబు మాట్లాడుతూ జీఎస్టీ వచ్చి ఏడేళ్లయినా గుంటూరులో ఎప్పుడూ లేని విధంగా పెద్దఎత్తున వార్షికోత్సవాన్ని కమిషనర్ నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. సోషల్ వర్కర్లను , ఆరోగ్య వీరులను గుర్తించి సత్కరించడం, ప్రతిభ చూపిన ఉద్యోగులకు, విశ్రాంత ఉద్యోగులు చేసిన సేవలకు గుర్తింపుగా ప్రశంసా పత్రాలు అందజేయడం భేష్ అన్నారు. జీఎస్టీని అత్యధికంగా కట్టిన పారిశ్రామికవేత్తలను సన్మానించడం బాగుందని పేర్కొన్నారు. అనంతరం కమిషనర్ నరసింహారెడ్డిని ఉద్యోగులు సత్కరించారు. కార్యక్రమంలో శాఖమూరి శ్రీనివాస్, బిల్లా ప్రశాంత్‌కుమార్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

అమెరికా పంపించి వస్తూ అనంత లోకాలకు..

కుమార్తెను విమానం ఎక్కించి వస్తూ రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి



వెంకట్రామిరెడ్డి మృతదేహం



ఎన్నాదేవి వద్ద రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు ముందుభాగం

సత్తెనపల్లి: కుమార్తె కుటుంబాన్ని అమెరికా పంపించి వస్తూ తండ్రి అనంత లోకాలకు వెళ్లిపోయిన ఘటన పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం ఎన్నాదేవి వద్ద బుధవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. సత్తెనపల్లి మండలం కట్టావారిపాలెం గ్రామానికి చెందిన గొట్టిముక్కల వెంకట్రామిరెడ్డి (55), రాజ్యలక్ష్మి దంపతులకు ముగ్గురు కుమార్తెలు. అంతా ఉన్నత చదువులు పూర్తి చేసి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా పనిచేస్తున్నారు. పెద్దకుమార్తె దీప్తి, రెండవ కుమార్తె ఉషకు వివాహలు కావడంతో ఇద్దరూ అమెరికాలో స్థిరపడ్డారు. మూడవ కుమార్తె తేజ అవివాహిత. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తోంది. ఈ క్రమంలో దీప్తి తన కుమార్తె యువాన్షికా రెడ్డి పుట్టిన రోజు వేడుకలు సత్తెనపల్లి మండలం కంటెపూడి గ్రామంలో గత నెల 15న జరిపేందుకు గత నెల 11న భర్త మహేష్, కుమార్తెలతో వచ్చారు. తిరిగి బుధవారం అమెరికా వెళ్లాల్సి ఉండటంతో దీప్తి, ఆమె భర్త మహేష్, కుమార్తె యువన్షికా రెడ్డిలను ఫ్లైట్ ఎక్కించేందుకు వెంకట్రామిరెడ్డి, కంటెపూడికి చెందిన వియ్యంకుడు తేళ్లూరి శ్రీనివాసరెడ్డి వెళ్లారు. వారిని విమానం ఎక్కించి తిరిగి కారులో వస్తుండగా సత్తెనపల్లి మండలం ఎన్నాదేవి వద్దకు రాగానే కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో వెంకట్రామిరెడ్డికి తీవ్ర గాయాలు కాగా శ్రీనివాసరెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి.బాధితులను సత్తెనపల్లి ప్రైవేట్ వైద్యశాలకు తరలించగా.. చికిత్స పొందుతూ వెంకట్రామిరెడ్డి మృతి చెందాడు. శ్రీనివాసరెడ్డికి స్వల్పగాయాలు కావడంతో ప్రాణప్రాయం నుంచి బయటపడ్డాడు. వెంకట్రామిరెడ్డి మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. సత్తెనపల్లి రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పాపం పసివాడు!

- అరుదైన వ్యాధి బారిన చిన్నారి
- బతకాలంటే రూ.16కోట్ల ఇంజక్షన్ అత్యవసరం
- అమెరికాలో మాత్రమే లభ్యం
- ప్రభుత్వ సాయం కోసం తల్లిదండ్రుల ఎదురుచూపులు
- మానవతావాదులు సాయం చేయాలంటూ వేడుకోలు



తల్లిదండ్రులతో చిన్నారి మహమద్ జియాన్

నరసరావుపేట: ఆర్నెళ్ల బాబుకి అనుకోని జబ్బు వచ్చింది. రూ.కోట్లు విలువైన ఇంజక్షన్ చేస్తేకాని తగ్గదా వ్యాధి. ఆ ఖర్చు భరించే శక్తిలేని మధ్యతరగతి కుటుంబంలో జన్మించాడా పసికందు. యావదాస్తిని అమ్మినా వైద్యం చేయించలేని స్థితిలో తల్లిదండ్రులు ఉన్నారు. ప్రభుత్వం పూనుకుంటే కాని ప్రాణం నిలువని పరిస్థితి. బుధవారం సాయంత్రం వారి స్వగృహంలో తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని నాలుగో వార్డు పనసతోటకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ షేక్ యాసిన్, షేక్ షిరీన్‌లకు గత డిసెంబరు 23వ తేదీన మగబిడ్డ జన్మించాడు. ఆ బిడ్డకు మహమద్ జియాన్ అనే పేరు పెట్టుకొని అల్లారుముద్దుగా చూసుకుంటున్నారు. తండ్రి యాసిన్ ఇంటివద్దనే ఉంటూ ఉద్యోగం చేస్తున్నాడు. నాల్గవ నెల వచ్చినా తల నిలుపకపోవటం, శ్వాస తీసుకోవటంలో ఇబ్బందిపడుతుండటం లాంటి లక్షణాలపై అనుమానం వచ్చిన తల్లిదండ్రులు గుంటూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చూపించారు. అక్కడి వైద్యులు జన్యుపరమైన జబ్బుతో బాధపడుతున్నట్లుగా అనుమానిస్తూ హైదరాబాదుకు రిపోర్టు పంపారు. అక్కడినుంచి ఆ పసికందు స్పైనల్ మజిల్ ఎట్రోఫీ(ఎస్ఎంఏ) టైప్–1 ప్రాణాంతకమైన జబ్బుతో బాధపడుతున్నట్లుగా నిర్ధారిస్తూ రిపోర్టు ఇచ్చారు. ఈ జబ్బు ప్రపంచంలో ప్రతి పదివేల మందికి ఒకరిలో మాత్రమే వస్తుందంటూ డాక్టర్లు తెలిపినట్లు తల్లిదండ్రులు వివరించారు. సికింద్రాబాదు వెళ్లి అక్కడి వైద్యులకు మరోసారి బాబును చూపించగా, వారు కూడా అదే జబ్బుతో బాధపడుతున్నట్లుగా నిర్ధారించారు. ఈ వ్యాధికి ఇంజక్షన్ ఖరీదు రూ.16కోట్లు అవుతుందని, అదీ అమెరికాలో మాత్రమే దొరుకుతుందని వారు తేల్చిచెప్పారు. దీనిపై గత నెలలో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబును, మానవవనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్‌లను కలిసి తల్లిదండ్రులు విన్నవించారు. ప్రభుత్వం నుంచి ఇంకా నిర్ణయం వెలువడాల్సి ఉంది. ప్రభుత్వసాయం తప్ప తమకు దిక్కులేదని తల్లిదండ్రులు వాపోతున్నారు. మానవతావాదులు స్పందించి తమకు సహాయం చేసి ఆదుకోవాలని వారు కోరుతున్నారు. సహాయం చేయాలనుకునేవారు షేక్ యాసిన్, సెల్ నంబరు 91778 34384 గూగుల్ పే, ఫోన్ పేల ద్వారా గానీ, వ్యక్తిగతంగాను కలిసి సహాయం చేయాలని కోరుతున్నారు.

ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ ప్రొటెక్షన్ కౌన్సిల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా క్రిష్టఫర్



క్రిష్టఫర్‌కు నియామక ఉత్తర్వులు అందజేస్తున్న ప్రొటెక్షన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షులు రాజారావు

తాడేపల్లిరూరల్ : ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ ప్రొటెక్షన్ కౌన్సిల్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దుగ్గిరాల మండలం మంచికలపూడికి చెందిన అద్దేపల్లి క్రిష్టఫర్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. బుధవారం ప్రొటెక్షన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షులు బుల్లా రాజారావు మంగళగిరిలో తన కార్యాలయంలో క్రిష్టఫర్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా క్రిష్టఫర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా కృషి చేస్తానని పేర్కొన్నారు.

కక్షసాధింపు రాజకీయాలు తగదు



సబ్‌జైలు బయట మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): అధికార పార్టీ నాయకులు వైఎస్సార్ సీపీ నాయకులపై వేధింపులు మానుకోవాలని మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. ఈపూరు మండల వైఎస్సార్ సీపీ నాయకుడు గోనుగుంట్ల వెంకట హనుమయ్యను వినుకొండ సబ్‌జైలులో బుధవారం పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల ముందు పోలీసులు నమోదు చేసిన కేసుల్లో వెంకట హనుమయ్య పేరు లేకపోయినప్పటికీ టీడీపీ అధికారంలోకి రాగానే చేర్చి జైలుకు పంపించడం దారుణమని ఖండించారు.

ఆదిలోనే నీరుత్సాహం

కష్టాలలో ఖరీఫ్

- ప్రాజెక్టుల్లో నీటి జాడేదీ!
- అడపాదడపా వర్షాలతో సరి
- నీటి విడుదలపై అయోమయం
- జిల్లాలో ఐదు శాతం విస్తీర్ణంలోనూ మొదలు కాని సాగు



పత్తి సాగు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: ఖరీఫ్ సాగు కష్టాల్లో కూరుకుపోతోంది. సాగునీరు వచ్చే అవకాశాలు కనపడకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రాజెక్టులన్నీ ఖాళీ అయిపోవడంతో సాగుకు నీటిని విడుదల చేసే అవకాశాలు కనపడటం లేదు. దీంతో ఇప్పటి వరకూ గుంటూరు జిల్లాలో ఐదు శాతం కూడా పంటలు వేయలేని దుస్థితి కనపడుతోంది. గుంటూరు జిల్లాలో 63,733 హెక్టార్లలో వరి సాగు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 1,525 హెక్టార్లలోనూ ప్రారంభం కాని దుస్థితి. మొక్కజొన్న ఐదు హెక్టార్లు, పెసలు 17 హెక్టార్లు, మినుములు 57 హెక్టార్లు, నువ్వులు 78 హెక్టార్లు, సోయాబీన్ 16 హెక్టార్లు మాత్రమే వేశారు. పత్తి విషయానికి వస్తే 26,982 హెక్టార్లలో వేయాల్సి ఉండగా ఇప్పటి వరకూ 2010 హెక్టార్లలో మాత్రమే వేశారు. కూరగాయలు 439 హెక్టార్లు, పచ్చి ఎరువు 2080 హెక్టార్లలో వేశారు. జిల్లా మొత్తం మీద 1,25,914 హెక్టార్లలో పంటలు వేయాల్సి ఉండగా ఇప్పటి వరకూ 6,438 హెక్టార్లు అంటే కేవలం 5.1 శాతం మాత్రమే వేశారు. జిల్లాలో ఇతర ప్రధాన పంటలైన మిర్చి, పసుపు, ఉల్లి, టమాటా పంటల సాగు ఇంకా మొదలు పెట్టనే లేదు.

డెల్టాకు నీటి విడుదలలో జాప్యం

వర్షాలు కూడా అనుకున్న స్థాయిలో కురవకపోవడంతో రైతులు పంటలు వేసేందుకు ముందుకు రావడం లేదు. మరోవైపు కృష్ణానది పరీవాహక ప్రాంతంలో వర్షాలు కురవకపోవడంతో ప్రాజెక్టులన్నీ ఖాళీగానే ఉన్నాయి. దీంతో డెల్టాకు నీటివిడుదల జాప్యం అయ్యే అవకాశం కనపడుతోంది. నాగార్జున సాగర్‌లో డెడ్ స్టోరేజి కన్నా పది టీఎంసీల నీటి మట్టం తక్కువగా ఉంది. శ్రీశైలం పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. కేవలం 37 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉంది. ఇక పులిచింతల సామర్థ్యం 45.77 టీఎంసీలు ఉంటే ప్రస్తుతం 0.4 టీఎంసీలు మాత్రమే ఉంది. ప్రకాశం బ్యారేజీ వద్ద కూడా 3.07 టీఎంసీలకు 2.08 టీఎంసీలు ఉన్నాయి. ఈ నెలలో కృష్ణానదీ పరీవాహక ప్రాంతంలో బాగా వర్షాలు పడితే గానీ ప్రాజెక్టులు నిండి కృష్ణా డెల్టాకు నీరు ఇచ్చే అవకాశం లేదని అధికారులు చెబుతున్నారు. మరి నీటి విడుదలకు ఎన్ని రోజులు పడుతుందో వేచి చూడాలి. ఇదిలా ఉంటే పట్టిసీమ నుంచి గోదావరి నీటిని బుధవారం విడుదల చేశారు.

క్లుప్తంగా

కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించాలి



గుంటూరు మెడికల్: జూలై 18 నుంచి ఆగస్టు 2 తేదీ వరకు జిల్లాలో కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని రాష్ట్ర కుష్ఠు నివారణ విభాగం జాయింట్ డైరెక్టర్ డాక్టర్ దేవసాగర్ సూచించారు. బుధవారం గుంటూరు డీఎంహెచ్ఓ కార్యాలయంలోని జిల్లా కుష్ఠు వ్యాధి నివారణ అధికారి కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. డాక్టర్ దేవసాగర్ మాట్లాడుతూ 'లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపైన్‌ను 14 రోజులపాటు నిర్వహిస్తున్నామన్నారు. వైద్య సిబ్బంది చిత్తశుద్ధితో విధులు నిర్వహించి వ్యాధిగ్రస్తులను గుర్తించాలని ఆదేశించారు. జిల్లాలో వ్యాధిగ్రస్తులకు అందుతున్న సేవల గురించి సిబ్బందితో చర్చించారు. గుర్తింపు ప్రక్రియపై ఆశా వర్కర్లకు, హెల్త్ అసిస్టెంట్లకు, క్షేత్రస్థాయి సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించాలని డెప్యూటీ పారామెడికల్ ఆఫీసర్లను ఆదేశించారు. ప్రస్తుతం గుంటూరు జిల్లాలో 67 మంది వ్యాధిగ్రస్తులకు ఉచితంగా మందులు, చికిత్స అందిస్తున్నట్టు జిల్లా లెప్రసీ అధికారి డాక్టర్ దాసరి శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా న్యూక్లియస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మానాయక్ భూక్య, పారామెడికల్ ఆఫీసర్ జె.మురళీకృష్ణ, ఫిజియోథెరపిస్ట్ కొడాలి శ్రీనివాస్, డెప్యూటీ పారామెడికల్ ఆఫీసర్స్ బసవయ్య, జోసెఫ్, నాగమల్లేశ్వరరావు, మురళీకృష్ణ, హుస్సేన్, సాంబశివరావు పాల్గొన్నారు.

స్కీం వర్కర్ల జోలికి వస్తే పోరాటం తప్పదు

- రాజకీయ వేధింపులపై ఈనెల 10న ఆర్డీఓ కార్యాలయాల వద్ద నిరసన
- ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటూరు మల్లేశ్వరి



పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న గుంటూరు మల్లీశ్వరి, డి. శివకుమారి

నరసరావుపేట: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుంచి స్కీం వర్కర్లపై రాజకీయ వేధింపులు అధికమయ్యాయని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటూరు మల్లేశ్వరి, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి.శివకుమారి పేర్కొన్నారు. కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మల్లీశ్వరి మాట్లాడారు. గతంలో ఇటువంటి పరిస్థితులు ఏర్పడినప్పుడు సూపర్‌వైజర్లు, సీడీపీఓలు స్పందించి ఆశా కార్యకర్తల పనితీరుపై విచారణ జరిపి మెమోలు ఇవ్వడం జరిగేదని, తొలగింపులు ఏనాడు జరగలేదని అన్నారు. ప్రస్తుతం రాజకీయ వేధింపులు తీరు చూస్తుంటే ప్రభుత్వం వేతనాలు ఇస్తున్నట్లు లేదని, రాజకీయ నాయకులు వేతనాలు ఇస్తున్నట్లుగానే తీరు కనిపిస్తుందన్నారు. కక్షపూరిత రాజకీయాలకు తావులేదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్‌లు చెబుతున్నారని, అయితే క్షేత్రస్థాయిలో జరుగుతున్న దానికి పూర్తి విరుద్ధంగా ఉందన్నారు. ఇప్పటికైనా సీఎం చంద్రబాబు స్పందించి అధికార యంత్రాంగం, మంత్రులు, ఎమ్మెల్యేలను అప్రమత్తం చేసి కక్షపూరిత రాజకీయ వైఖరికి స్వస్తి చెప్పాలని సూచించారు. డి.శివకుమారి మాట్లాడుతూ నాడు అండగా ఉంటామని చెప్పి, నేడు వేధింపులకు పాల్పడుతున్నారని విమర్శించారు. కిందిస్థాయి నాయకులను అదుపు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వం యంత్రాంగంపై ఉందని తెలిపారు. గత ప్రభుత్వ పాలనలో నాలుగున్నరేళ్ల తర్వాత పోరాటం చేయాల్సి వచ్చిందని, కానీ ప్రస్తుతం నెల రోజుల సమయంలోనే పోరాటాలకు సిద్ధం కావాల్సి రావటం శోచనీయం అన్నారు. ఆశాలు, అంగన్‌వాడీలు భయపడి రాజీనామాలకు సిద్ధపడొద్దని, యూనియన్ అండగా ఉంటుందని, ఇబ్బందులు ఎదురైతే తమను ఆశ్రయించాలని భరోసా ఇచ్చారు. ఈ నెల 10న రాష్ట్రవ్యాప్తంగా అన్నీ ఆర్డీఓ కార్యాలయాల వద్ద జరిగే ధర్నాలో స్కీం వర్కర్లు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

యానిమేటర్స్‌ని తప్పకోమనడం అమానుషం

భవిత మండల సమాఖ్య మాజీ అధ్యక్షురాలు రత్నమంజీర

అచ్చంపేట: యానిమేటర్స్‌ని తప్పుకోమంటూ గ్రామాల్లో టీడీపీ ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకులు ఒత్తిడి తేవడం అమానుషమని భవిత మండల సమాఖ్య మాజీ అధ్యక్షురాలు చల్లా రత్నమంజీర ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇలానే చేశారా ? అంటూ ఆమె ప్రశ్నించారు. మండలంలో 46మంది యానిమేటర్స్ ఉండగా ఆయా గ్రామాలలో టీడీపీ నాయకులు తమ వారిని నియమించుకోవాలి.. తప్పుకోమంటూ ఒత్తిడి తెస్తున్నారన్నారు. కారణం అడిగితే.. వైఎస్సార్ సీపీ వారని కొంతమందిని... మరికొంత మందిని ఎన్నికలలో టీడీపీ తరఫున ప్రచారం చేయలేదని చెబుతూ తప్పుకోమని ఒత్తిడి చేస్తున్నారన్నారు. ఎన్నో సంవత్సరాలుగా గ్రామాల్లో మహిళలకు పొదుపుపై అవగాహన కల్పిస్తూ, వారిని సంఘాలుగా ఏర్పాటు చేసి, బ్యాంకులలో ఖాతాలు ప్రారంభించి ప్రభుత్వ పథకాలతో వారి జీవన విధానంలో మార్పులు తీసుకు వచ్చిన యానిమేటర్స్‌ని తప్పుకోమనడం దారుణమని ఖండించారు. అధికారులతో పని లేకుండా గ్రామ సమాఖ్యల ద్వారా తమకు అనుకూలంగా తీర్మానాలను రాయించుకుని ఎన్నో సంవత్సరాలుగా పనిచేస్తున్న వారి జీవన విధానానికి విఘాతం కల్పిస్తూ, కనీస విద్యార్హత కూడా లేనివారిని నియమించుకోవడం ఎంతవరపు సమంజసమో ప్రజా ప్రతినిధులు పునరాలోచించాలని ఆమె కోరారు.

విజిలెన్స్ తనిఖీలు

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): ఏటుకూరు రోడ్‌లోని యారా ఫెర్టిలైజర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ దుకాణంలో గుంటూరు రీజినల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగ అధికారులు బుధవారం తనిఖీలు చేశారు. వ్యవసాయ శాఖ అనుమతుల్లేకుండా ఎరువులు విక్రయిస్తున్నారనే ముందస్తు సమాచారంతో విజిలెన్స్ ఎస్పీ కె.ఈశ్వరరావు ఆదేశాల మేరకు తనిఖీలు జరిగాయి. స్టాక్ రిజిస్టర్‌లో నమోదైన నిల్వలకు, దుకాణంలోని నిల్వలకు తేడాలు ఉన్నట్లు గుర్తించారు. దుకాణ యాజమాని నిబంధనలు ఉల్లంఘించగా, రూ.2,06 లక్షల ఖరీదైన ఒక మెట్రిక్ టన్ను ఇంపోర్టెడ్ ఫెర్టిలైజర్స్ అమ్మకాలు నిలుపుదల చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ ఏఓ ఒ.రమణకుమార్, ఎస్ఐ ఎం.రామచంద్రయ్య, స్థానిక ఏఓ బి.గౌతమ్‌ప్రసన్న, సిబ్బంది పాల్గొన్నారు.

పొదుపు సంఘాల బలోపేతమే లక్ష్యం

డీఆర్‌డీఏ పీడీ వై. పిచ్చిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న పిచ్చిరెడ్డి

బాపట్ల టౌన్: పొదుపు సంఘాల బలోపేతానికి చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ వై. పిచ్చిరెడ్డి తెలిపారు. బాపట్ల మండల సమాఖ్య కార్యాలయంలో బుధవారం జిల్లాలోని ఏపీఎంలు, సీసీలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొదుపు సంఘాల మహిళలు తీసుకున్న రుణాలు క్రమం తప్పకుండా బ్యాంకులకు చెల్లించేలా చూడాలని చెప్పారు. సకాలంలో చెల్లించని గ్రూపుల వివరాలు సేకరించి ఏపీఎం, సీసీలు గ్రూపు సభ్యులతో సమీక్షించాలని ఆయన సూచించారు. పొదుపు సంఘాల మహిళల ఆర్థికాభివృద్ధికి పాటుపడాలని తెలిపారు. కార్యక్రమంలో ఏరియా కోఆర్డినేటర్లు, స్త్రీనిధి అసిస్టెంట్ జనరల్ మేనేజర్, కాంపోనెంట్ ఏపీఎంలు, 25 మండలాల ఏపీఎంలు, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు, ఎల్‌సీ సీసీలు పాల్గొన్నారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య



బసవరాజు మృతదేహం

మేదరమెట్ల: పురుగుమందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కొరిశపాడు మండలంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రావినూతల గ్రామానికి చెందిన మోపర్తి బసవరాజు (47) భార్యతో గొడవపడి తీవ్ర మనస్తాపం చెందాడు. దీంతో పురుగుల మందు తీసుకుని గ్రామ సమీపంలోని బెల్లం వారికుంట వద్ద తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పొలం వెళ్లిన స్థానికులు అతని మృతదేహాన్ని గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కొరిశపాడు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుని తల్లి కావమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. భార్యాభర్తల మధ్య వివాదమే ఆత్మహత్యకు కారణమని తెలిపారు.

రూ. 8.59 లక్షల పురుగు మందుల అమ్మకాలు నిలుపుదల



పట్టణంలోని శ్రీరామ ఫర్టిలైజర్స్‌లో తనిఖీలు చేపడుతున్న ఇన్‌చార్జ్ ఏడీఏ శ్రీధర్‌రెడ్డి

సత్తెనపల్లి: పట్టణంలోని శ్రీరామ ఫర్టిలైజర్స్ పురుగు మందుల దుకాణంలో అధీకృత డీలర్ నుంచి కాకుండా డీలర్ వద్ద ప్రిన్సిపల్ సర్టిఫికెట్ నమోదు కాని వారి వద్ద నుంచి కొనుగోలు చేసిన రూ. 8.59 లక్షల విలువైన పురుగు మందుల అమ్మకాలను వ్యవసాయశాఖ అధికారులు నిలుపుదల చేశారు. పట్టణంలోని పురుగు మందుల దుకాణాల్లో బుధవారం సత్తెనపల్లి ఇన్‌చార్జ్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్.శ్రీధర్ రెడ్డి సాధారణ తనిఖీలు నిర్వహించారు. శ్రీ రామ ఫర్టిలైజర్స్‌లో ప్రిన్సిపల్ సర్టిఫికెట్ నమోదు కాని వారి వద్ద నుంచి పురుగు మందులు ఎలా కొనుగోలు చేశారని దుకాణదారుడైన బాలనాగు వంశీకృష్ణను ప్రశ్నించారు. తనకు సరుకు ఇచ్చిన షాపు యజమాని తమ షాపు పేరుతో ప్రిన్సిపల్ సర్టిఫికెట్ నమోదైందని తెలియజేయడం వల్ల కొనుగోలు చేశానన్నారు. కానీ తనిఖీల్లో సరఫరా చేసినటువంటి డీలర్ పేరు ప్రిన్సిపల్ సర్టిఫికెట్‌లో లేకపోవడంతో రూ. 8,59,265 విలువచేసే 670 లీటర్లు పురుగుమందుల అమ్మకాలను నిలుపుదల చేశారు. అధమ కంపెనీ వారి ఆసిఫేట్ 240 కేజీలు, జీఎస్‌పీ క్రాప్ సైన్స్ ఏసిఫేట్ 150 కేజీలు, స్వాల్, ర్యాలీస్ ఇండియా లిమిటెడ్‌కు సంబంధించిన పెండిమిదలిన్ 280 లీటర్ల స్టాక్స్ నుంచి నాణ్యత పరీక్షలు నిమిత్తం ఒక్కో బ్యాచ్‌కు ఒక శాంపిల్ సేకరించి ల్యాబ్‌కు పంపినట్లు ఏడీఏ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఆయన తోపాటు సిబ్బంది ఉన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము	
మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ	
ఇ-ప్రొక్యూర్‌మెంట్ షార్టు టెండరు నోటీసు	
ఆర్.ఓ.సి.నెం.1151/2024/ఇ1 నిట్ నెం: 05/జే.టి.ఓ/2024-25	తేది.03-07-2024
మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ సాధారణ నిధుల క్రింద ఈ దిగువ ఉదహరించిన పనులకు ఈ దిగువ ఉదహరించిన తేదీల యందు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండరు పిలువబడినది.	
మొత్తము పనులు: 04 నెం.	అంచనా వ్యయము రూ. 35.65 లక్షలు
పని నెం: 01 నుండి 04 లకు :	
1 టెండరు షెడ్యూల్ డౌన్‌లోడ్ కొరకు నిర్ణయించిన ప్రారంభ తేదీ.	ది.04-07-2024 ఉ॥ 11.00 గం.ల నుండి
2 టెండరు షెడ్యూల్ డౌన్‌లోడ్ కొరకు నిర్ణయించిన చివరి తేదీ	ది.08-07-2024 ఉ॥ 11.00 గం.ల వరకు
3 ప్రైస్ బిడ్ తెరుచు తేదీ.	ది.08-07-2024 మ॥02.00 గం.లకు
మిగతా వివరములకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్ http://www.apeprocurement.gov.in చూడగలరు. మొబైల్ నెం. 98499 07303	
సం/- కమీషనరు, మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ	

సౌత్ ఇండియా టెన్నిస్ పోటీల్లో పల్నాడు విద్యార్థిని ప్రతిభ

- అండర్ -10, అండర్ -12 పోటీల్లో రన్నరప్‌గా నిలిచి రెండు ట్రోఫీలు గెలిచిన సూక్తిశ్రీ
- అభినందించిన రాష్ట్ర హోంమంత్రి అనిత, హెచ్‌పీసీఎల్ హెచ్ఆర్ చీఫ్ మేనేజర్ శ్రీకాంత్



చిన్నారి సూక్తికి ట్రోఫీలు అందజేస్తున్న హెచ్‌పీసీఎల్ హెచ్ఆర్ చీఫ్ మేనేజర్ శ్రీకాంత్ తదితరులు



అభినందిస్తున్న రాష్ట్ర హోం మంత్రి అనిత. చిత్రంలో బాలిక తండ్రి శ్రీనివాస్

నరసరావుపేట: విశాఖపట్నం ఆంధ్రా యూనివర్సిటీ టెన్నిస్ కోర్టులో సోమ, మంగళవారం రెండు రోజుల పాటు నిర్వహించిన అండర్-10, అండర్-12 సిట్ సౌత్ ఇండియా టెన్నిస్ పోటీలలో పల్నాడు జిల్లా నరసరావుపేట పట్టణానికి చెందిన పీవీ సూక్తిశ్రీ అత్యుత్తమ ప్రతిభ చాటి రెండు రన్నరప్ ట్రోఫీలు గెలుచుకుందని కోచ్ బుక్యా బాబునాయక్ బుధవారం చెప్పారు. ఈ పోటీలకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 70 మందికి పైగా హాజరయ్యారని అన్నారు. ప్రతిభ చాటిన చిన్నారి సూక్తిశ్రీని విశాఖపట్నంలో రాష్ట్ర రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, హెచ్‌పీసీఎల్ హెచ్ఆర్ చీఫ్ మేనేజర్ బి.శ్రీకాంత్ ట్రోఫీలు బహూకరించి అభినందించారన్నారు. చిన్నారి ఇప్పటికే రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఎన్నో టోర్నమెంట్‌లలో పాల్గొని సత్తా చాటిందని, తాజాగా విశాఖపట్నంలో జరిగిన సిట్ సౌత్ ఇండియా పోటీలో ప్రతిభ చాటిందన్నారు. గతంలో అండర్-14 విభాగంలో పదేళ్ల సూక్తిశ్రీ పోటీపడి సత్తా చాటినట్లు పేర్కొన్నారు. తల్లిదండ్రులు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ సురేఖల ప్రోత్సాహంతో సూక్తిశ్రీ రెండేళ్ల నుంచి నరసరావుపేట ఆఫీసర్స్ క్లబ్‌లోని విశాలమైన క్రీడా ప్రాంగణంలో టెన్నిస్ శిక్షణ తీసుకుంటుందన్నారు. చిన్నారి సూక్తిశ్రీ పట్టణంలోని ప్రకాష్‌నగర్ సీబీఐటీ స్కూల్‌లో ఆరవ తరగతి చదువుతుంది.

రసకందాయంలో చిత్తూరు, కర్నూలు మ్యాచ్

ఎదురీదుతున్న కర్నూలు జట్టు

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్కేఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో జరుగుతున్న చిత్తూరు, కర్నూలు జట్లు మధ్య మ్యాచ్ రసకందాయంలో పడింది. ఓవర్‌నైట్ స్కోర్ 5 వికెట్ల నష్టానికి 361 పరుగులతో రెండవరోజు బుధవారం బ్యాటింగ్ ప్రారంభించిన చిత్తూరు జట్టు మరో 13 పరుగులు జోడించి 7 వికెట్లు నష్టానికి 374 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో 113 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులోని బి.శివయ్య 43 పరుగులు సాధించాడు. చిత్తూరు బౌలర్లు బి.ప్రకాష్ 4, డి.తులసీరామ్ 3వికెట్లు సాధించారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన చిత్తూరు జట్టు 7 వికెట్లు నష్టానికి 146 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. జట్టులోని సోహన్ రెడ్డి 36 పరుగులు సాధించాడు. కర్నూలు బౌలర్ కె.విఘ్నేష్‌కు 4వికెట్లు లభించాయి. అనంతరం 407 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు రెండో ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన కర్నూలు జట్టు రెండవరోజు ఆట ముగిసే సమయానికి 2 వికెట్లు నష్టానికి 20 పరుగులు సాధించి విజయానికి 388 పరుగుల దూరంలో ఎదురీదుతోంది. మ్యాచ్‌ను ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు కె.వి.పురుషోత్తమరావు, గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎస్.సీతాపతిరావు పర్యవేక్షించారు.

సొమ్ము చెల్లించకుండా వేధిస్తున్నాడు

మాచర్ల పట్టణ ఎస్ఐపై జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసిన దంపతులు



మాట్లాడుతున్న రామలక్ష్మమ్మ

నరసరావుపేట: రిజిస్ట్రేషన్ చేయించుకున్న భూమి తాలూకా మిగిలిన సొమ్ము చెల్లించకుండా మాచర్ల పట్టణ ఎస్ఐ గోపాల్ ఇబ్బంది పెడుతున్నాడని ప్రకాశం జిల్లా కంభం మండలం రావిపాడు గ్రామానికి చెందిన దంపతులు ముత్యాలపాటి కోట వెంకట సుబ్బయ్య, రామలక్ష్మమ్మలు చెప్పారు. బుధవారం జిల్లా ఎస్పీ మలికా గార్గ్‌ను కలిసి తమను ఇబ్బందిపెడుతున్న ఎస్ఐపై ఫిర్యాదు చేశారు. తమ కుటుంబానికి చెందిన 3.75 ఎకరాల భూమిని గతేడాది జూన్‌లో ఎస్ఐకు రూ.37 లక్షలకు విక్రయించగా అందులో రూ.24 లక్షలు చెల్లించి ఆయన భార్య వరలక్ష్మి పేరుపై రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడన్నారు. మిగిలిన రూ.13 లక్షల గురించి అడిగితే ఇవ్వకుండా ఇబ్బందిపెడుతున్నాడని తెలిపారు. ఆ డబ్బులు ఇప్పించి తమకు న్యాయం చేయాలని కోరారు.

మత్తులో యువకుడిపై కత్తితో దాడి



దాడిలో గాయపడిన ఆంజనేయ ప్రసాద్ (బుజ్జి)

తాడేపల్లిరూరల్ : గంజాయి, మద్యం మత్తులో ఓ యువకుడు మరో యువకుడిపై కత్తితో దాడి చేసిన ఘటనపై బుధవారం తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితుడు కొల్లూరు ఆంజనేయ ప్రసాద్ (బుజ్జి) కథనం ప్రకారం.. సీతానగరంలో ఉంటూ డ్రైవర్‌గా పనిచేస్తున్న బుజ్జి మంగళవారం రాత్రి తన కారును పార్కింగ్ చేస్తుండగా అదే ప్రాంతానికి చెందిన భరత్ గంజాయి, మద్యం మత్తులో కత్తితో దాడి చేశాడు. గతంలో భరత్ దొంగనోట్ల మార్పిడి, దారి దోపిడీ కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. ఇటీవల భరత్ రూప అనే మహిళపైనా దాడి చేసినట్టు సమాచారం. గతంలో భరత్ ఆగడాలపై పోలీసులను ఆశ్రయించినా పట్టించుకోలేదని, ఇప్పటికైనా కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఇదిలా ఉంటే భరత్ మద్యం మాత్రమే తాగుతాడని, గంజాయి సేవించడమని అతడి బంధువులు చెబుతున్నారు.

స్థానిక సంస్థల్లో ఖాళీలకు ఎన్నికలు జరపాలి



అమరావతి: రాష్ట్రంలోని స్థానిక సంస్థలలో ఖాళీగా ఉన్న సర్పంచ్, ఎంపీపీ, జడ్పీటీసీ, వార్డు మెంబర్, ఎంపీటీసీ ఖాళీలకు ఎన్నికలు నిర్వహించాలని బుధవారం ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలక్షన్ కమిషనర్ నీలం సాహ్నికి అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 117 గ్రామ పంచాయతీ సర్పంచులు, 566 వార్డు మెంబర్లు, 179 ఎంపీటీసీలు, 14 జడ్పీటీసీలు, 16 ఎంపీపీలు, 111 ఉప సర్పంచు స్థానాలు వివిధ కారణాలతో ఖాళీగా ఉన్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం 13-ఏ ప్రకారం ఈ ఖాళీలకు 120 రోజుల్లోపు ఎన్నికలు జరగాల్సి ఉందన్నారు. వివిధ కారణాల చేత నేటివరకు ఎన్నికలు జరపలేదన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎలక్షన్ కమిషన్‌ను సాధారణ ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వాలని కోరామని తెలిపారు.

సాహిత్య రంగంలోని వారికే ఆ పదవులు ఇవ్వాలి

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): సాహిత్య రంగంలో నామినేటెడ్ పదవులను ఆయా శాఖల్లో అనుభవం ఉన్న వారికి ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి చలపాక ప్రకాష్, కార్యదర్శి ఎస్.ఎం.సుభాని బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ఏపీ సాహిత్య అకాడమీ, తెలుగు అకాడమీ, అధికారభాషా సంఘం, గ్రంథాలయ పరిషత్ ఇతరత్రా సాహిత్య రంగాల శాఖల్లో నియమించనున్న రాష్ట్ర, జిల్లా చైర్మన్లను, సభ్యులను సాహిత్యేతరులతో కాకుండా జాతీయస్థాయిలో అనుభవం ఉన్న వారిని ఎంపిక చేయాలని సూచించారు. కవులు, రచయితలు, కళాకారులకు అందించే ఉగాది పురస్కారాలు, కళారత్న అవార్డులను పునఃప్రారంభించాలని కోరారు. పుస్తకాల ప్రచురణకు గతంలోలా ఆర్థిక సహాయం అందించేలా కృషి చేయాలని కోరారు.

మహిళా మార్టుల్లో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు

ప్రకృతి వ్యవసాయం అడిషనల్ డైరెక్టర్ మహిత



మాట్లాడుతున్న ఏడీ మహిత

నరసరావుపేట రూరల్: మహిళా మార్టుల్లో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయాలు జరుగుతున్నట్టు ప్రకృతి వ్యవసాయం అడిషనల్ డైరెక్టర్ మహిత తెలిపారు. కోటప్పకొండలోని జిల్లా గ్రామీణాభివృద్ధి కార్యాలయంలో బుధవారం కృషి సఖి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అడిషనల్ డైరెక్టర్ మహిత, జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ అమలకుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ రైతులు తొమ్మిది సార్వత్రిక సూత్రాలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. ప్రీ మాన్‌సూన్ డ్రై సోయింగ్ విత్తనాల కిట్స్‌లో 30 రకాల విత్తనాలు 15 కిలోల చొప్పున పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. కిట్లో పప్పు దినుసులు, చిరుధాన్యాలు, నూనె గింజలు, ఆకు కూరలు, తీగజాతి కూరగాయలు, సుగంధద్రవ్యాలు, పచ్చిరొట్ట విత్తనాలు ఉంటాయని తెలిపారు. వీటిని పండించడం వల్ల కలుపు నివారించవచ్చని, ఆకు కూరలు తీసుకోవచ్చని, పశువుల మేతగా వాడుకోవచ్చని తెలిపారు. మిగిలినవి భూమిలో కలియదన్నడం వల్ల భూసారం పెరుగుతుందని వివరించారు. కాంపోస్ట్ బాక్స్‌లు ఏర్పాటుచేసి రసాయనాలు లేని వ్యవసాయం చేయాలని తెలిపారు. సమావేశంలో అడిషనల్ జిల్లా ప్రాజెక్టర్ మేనేజర్ ప్రేమ్‌రాజు, ఏపీఎం శివకుమార్, గ్రామసంఘం కార్యకర్తలు పాల్గొన్నారు.

గిరిజన వసతి గృహాలపై ప్రత్యేక దృష్టి సారించాలి



బి శ్రీనునాయక్

చిలకలూరిపేట: రాష్ట్రంలో ఉన్న గిరిజన వసతి గృహాల పరిస్థితి అగమ్య గోచరంగా ఉందని వాటిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని ఏపీ గిరిజన సంఘాల ఐక్య వేదిక అధ్యక్షుడు బి. శ్రీనునాయక్ కోరారు. పట్టణంలోని ఎన్ఆర్‌టీ సెంటర్‌లో ఉన్న సంఘ కార్యాలయంలో బుధవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతి గృహాల్లో ఏఎన్ఎంలను నియమించాలని డిమాండ్ చేశారు. గిరిజన గురుకుల పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల కొరతను సృష్టించి వారికి ఇష్టం వచ్చిన వారికి సీట్లు కేటాయిస్తున్నారని ఆరోపించారు. అలాంటి హెచ్ఎంలను గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం గిరిజన నామినేటెడ్ పదవుల్లో మైదాన ప్రాంత గిరిజనులకు అవకాశం కల్పించాలని కోరారు.

వ్యవసాయ మోటార్లకు మీటర్ల బిగింపు విరమించాలి

- ప్రతిపక్ష హోదాలో చంద్రబాబు చెప్పినట్లు మీటర్లను పగలగొట్టాలి
- సీపీఎం జిల్లా కమిటీ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు వి.కృష్ణయ్య



జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణయ్య, నాయకులు

నరసరావుపేట: వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగిస్తే పగులకొట్టాలని ప్రతిపక్ష హోదాలో ప్రకటించిన నారా చంద్రబాబునాయుడు, నారా లోకేష్‌లు నేడు అధికారంలో వారే ఉన్నందున ఆ పని విరమించుకోవాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు వి.కృష్ణయ్య కోరారు. కోటప్పకొండ రోడ్డులోని పార్టీ కార్యాలయంలో జిల్లా కమిటీ సభ్యులు రాధాకృష్ణ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. వ్యవసాయ రంగానికి ప్రధానంగా అవసరమైన విద్యుత్ మోటార్లకు మీటర్ల బిగించే ప్రక్రియకు నాడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.6 వేల కోట్లతో మీటర్లు కొనుగోలు చేశారని ప్రతిపక్ష హోదాలో వారు ఆరోపించారన్నారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగిస్తే వాటిని పగలగొట్టండని చెప్పారని, ప్రస్తుతం టీడీపీ హయాంలో అనకాపల్లి జిల్లాలో మీటర్ల బిగింపు ప్రక్రియను రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని, వారు చెప్పినట్లే ఆ మీటర్లు పగల గొడుతున్నారన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాతో పాటు కొన్ని జిల్లాలలో ఇదే తంతు కొనసాగుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విద్యుత్ సంస్కరణ చట్టాన్ని గత ప్రభుత్వం మాదిరిగానే అనుసరించడం పలు అనుమానాలు తావిస్తుందన్నారు. ప్రభుత్వం రైతుల వ్యతిరేక పోకడలకు పోతే ఆయా సంఘాల ఆధ్వర్యంలో సరైన బుద్ధి చెబుతామన్నారు. ఎన్నికలకు ముందు టీడీపీ చెప్పిన మాట ప్రకారం వ్యవసాయ మోటార్లకు మీటర్ల బిగింపు ప్రక్రియ నిలిపివేయాలన్నారు. రాష్ట్ర భవిష్యత్ కోసం కూటమిగా ఉన్నామని ఒకవైపు చెబుతూనే మరోవైపు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నారని, రైతు సంక్షేమాన్ని గాలికి వదిలేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఎరువులు, విత్తనాలు కొరత తీవ్రంగా ఉందని, పంట కాలువల మరమ్మతులు లేక నీరు విడుదల చేసిన పంట పొలాలకు సరఫరా కాని పరిస్థితి నెలకొందన్నారు. రైతాంగ సమస్యలు తెలుసుకొని పరిష్కరించాల్సిన ప్రభుత్వం ఇంకా సమస్యలు పెంచుతుందన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద పంట పెట్టుబడి కోసం ప్రభుత్వం ఇస్తామన్న రూ.20వేల కోసం రైతులు ఎదురుచూస్తున్నారని, వెంటనే వ్యవసాయ రంగానికి రైతులకు ప్రాధాన్యత క్రమంగా ప్రధాని ఇచ్చినట్లుగానే నగదును పంపిణీ చేయాలన్నారు. రైతులకు అవసరమైన అన్ని సౌకర్యాలను ప్రభుత్వం కల్పించి ఆదుకోవాలని కోరారు. సీనియర్ నాయకులు గద్దె చలమయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక స్కీం వర్కర్లను వేధిస్తున్నారన్నారు. కార్మికుల, స్కీం వర్కర్ల హక్కులు కాపాడేందుకు సీపీఎం ఎల్లప్పుడు పోరాటాలకు సిద్ధంగా ఉంటుందన్నారు. ప్రతిపక్ష హోదాలో టీడీపీ నాయకులు కార్మికులు స్కీం వర్కర్ల హక్కులు కాపాడుతామని వారి సమస్యలు పరిష్కరిస్తామని ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని సూచించారు. పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్, జిల్లా కమిటీ సభ్యులు డి.శివకుమారి, జి.మల్లేశ్వరి, టి.పెద్దిరాజు, ఏపూరి గోపాలరావు, పెండ్యాల మహేష్, జి.రవిబాబు, కొత్తపల్లి హనుమంతరెడ్డి పాల్గొన్నారు.